కథ



# గాయం

వీరాజీ

**శ**ర్వాణీ మిస్‌ని అర్జంటుగా రమ్మని కేకేశాడు ప్రిన్సిపాల్.

చీమల పుట్టలాగ మొహం పెట్టి ప్రిన్సిపాల్ రూమ్ గుమ్మంలోకి ఆమె చిరాకుగా వెళ్లేసరికి అతను తాపీగా ఫోన్‌లో మాట్లాడుతున్నాడు- "ఈ ఆదివారం పార్టీ వేసుకుందామా?" అని మళ్లీ, మా బ్రతుకులకి ఆదివారాలెక్కడ బ్రదర్? పాపం... రెస్ట్ లేక మా హెడ్ మాస్టర్ పీచుగారు గోల పెట్టేస్తున్నాడు! ప్రతీ ఆదివారం మా స్కూల్లో స్టాఫ్ కోసం ఇంటర్వ్యూ లుంటాయి! హెచ్.ఎమ్.తో పాటు నేనూ, మరో ఇద్దరు కమిటీ మెంబర్లు కూచుని ఇంటర్వ్యూలు చేస్తాం... అఫ్ కోర్సు, కమిటీ అంటే మా బామ్మర్దీ, మేనల్లుడూ- ఆళ్లేలే, కాని, ఎనిమిది గంటలకి రావాలా? చివరికి డెమోలయేసరికి రెండవుద్ది. లెక్కలకి టీచర్లు దొరికి చావరయ్యా "ఇంగ్లీషు పాఠాలు తెలుగులో చెప్పొచ్చా అండీ?" అంటాడయ్యా వో ఎమ్మే లిట్ పంతులూ... ఏదోలే అని ఇట్లా సెలక్టు చేస్తాం, అట్లా మానేస్తారు..." అవతలి వాడు విసుగుతో మాట మార్చినట్లున్నాడు అంచేత ప్రిన్సిపాలు కూడా ఆగి "మరోసారి చూద్దారిలే పార్టీ గీర్టీ" అంటూ ఫోన్ పెట్టేశాడు. అతని మొహం నిండా విసుగు అలుముకొని వుంది.

"ఏమ్మా! గాజులు చేత్తో పిల్లకాయల్ని వీప ులమీద బాదేస్తావంటగా? నీ గాజులు బంగారం గానూ... అందుకే రమ్మన్నా... నిన్న నవనీతం అనే స్టూడెంట్‌ని వోరేవు పెట్టావంటగా... నీ గాజులు చిట్లి, ఆ పిల్ల వీపు మీద గ్రుచ్చుకున్నాయంట. ఆ కుర్రది నిన్న ఇంటర్‌వెల్‌లో పారిపోయింది. పోని అదైనా నీకు తెలుసా? శాడిజం అంటారు. ఇలా చేస్తే తెల్సా? అంటూ వడగండ్ల వాన కురిపించేశాడు. శర్వాణికి వొళ్లు మండిపోయింది.

"బంగారం గాజులు మాకెక్కడొస్తాయి సార్? అసలా నవనీతం చదివేది ఆరో క్లాసే, గానీ దాని వొళ్లంతా పొగరే సార్!" ముక్కు పుటాలు ఎగరేసింది.

"దాని ఫాదర్ వో పోలీసంట. అతణ్ణి పిలిచి చెప్పి నన్ను ఎక్కడో తోయించేస్తుందట!" అంటూ ఎర్రగా చూసింది. ఆమెకింకా అవమానభారం తగ్గలేదు...

నవ్వాడు కరస్పాండెంట్ కమ్ ప్రిన్సిపాల్ కమ్ స్కూలు యజమాని. "అందుకని దాని అంతు చూస్తానన్నావు నువ్వు...? ఇవేం పనులమ్మా? తల్లిదండ్రులు వాళ్ల కష్టార్జితాల్లో నాలుగో వంతు నెలనెలా మన ఎదాన కొట్టి పిల్లకాయలకి నాలుగు ఇంగ్లీషు ముక్కలు వస్తే గొప్పగా వుంటుందనీ... అంపిస్తున్నారు. అబ్బెబ్బే... ఎమ్మెస్సీ ఫస్ట్ క్లాసంటావ్... పిల్లల సైకాలజీ తెలవకపోతే ఎట్టామ్మా? నో... నో... మా స్కూల్లో కొట్టకుండా లెస్సన్స్ చెప్పాలి... బి కేర్ ఫుల్ హియర్ ఆఫ్టర్ ... ఆర్... రిజైన్... యూకెన్ గో.." అన్నాడు.

బుసలు కక్కుతూ వెళ్లిపోయింది.

నిజానికి శర్వాణికి చేతిదురుసుతనం ఎక్కువ!

అసలామె హయ్యర్ క్లాసులకి కెమిస్ట్రీ చెప్తానంటూ ఇంటర్వ్యూకి వచ్చింది.

వంటింట్లో బుట్టలో వుంటుందే, ఉప్పు దాన్ని కెమిస్ట్రీలో ఏంటంటారు? పోపుల పెట్టెలో వుంటుందే, తినే సోడా, దాని పేరేంటి? ఫార్ములా ఏంటి? బట్టలకి నీలిమందు పెడితే, అవి తెల్లగా ఎందుకవుతాయి? లాంటి జి.కె. ప్రశ్నలేసి అన్‌ఫిట్ చేసేశారు కమిటీ మెంబర్లు. ఆరోక్లాసులో ఖాళీ వుంది... అక్కడ వేశారు. కాని తక్కువ అనుభవం వున్న యువతి కాదామె... ఆరో స్కూలు యిది....

పాత స్కూలు- ఒకదానిలో పిల్లలు అల్లరి చేసినప్పుడల్లా 'బాద' మని- దెబ్బకి దెయ్యం ఝుడుస్తుంది అన్నట్లు- తన్నులు పడితే తప్ప పిల్లల్లో డిసిప్లిన్ ఉండదనీ- వో పెద్ద రూళ్ల కర్ర సప్లయి చేశాడు అక్కడి హెడ్ మాస్టర్!

ఆ స్కూల్లో ఒకరోజు క్లాసంతా గోల చేస్తున్నారు. ఐదో క్లాసు పిల్లలంతా... ఉండుండి చెలరేగిపోయి అల్లరి చేస్తారు.

"సైలెన్స్ ... సైలెన్స్ నోటిమీద వేలేసుకోండి" అని అరుస్తూ శర్వాణి ఓ వేపు పిల్లల్ని అదుపుచేస్తూ వుంటే రెండోవేపు అల్లరి ఎక్కువవుతోంది. అంతలో హెచ్.ఎమ్. అటు వచ్చాడు. ఈ దృశ్యం చూసి, వీరావేశం ఎత్తిపోయాడు.

ఆమె చేతి బెత్తం లాక్కుని దాంతో పిల్లల్ని ఎక్కడి వాళ్లనక్కడే బాదేశాడు. నీలి అంచు




ఇమేజ్ హాస్పటల్స్ అమీర్‌పేట్, హైదరాబాదు

అందిస్తోంది

కాస్మెటిక్ మరియు ప్లాస్టిక్ సర్జరీ విభాగం

(Cosmetic and Plastic Surgery Division)

- పుట్టుకతో వచ్చే లోపాలు:
  a) గ్రహణం మొర్రి b) అంగలి తొర్రి
  c) చేతి మరియు కాళ్ళ వేళ్ళ లోపాలు, చెవి, ముక్కు లోపాలకు ఆపరేషన్.
- ముఖానికి తగిలిన గాయాలు, ముఖంలో ప్రమాదం వలన దవడలు, ముక్కు విరిగితే ఆపరేషన్ ద్వారా సరిచేసే సదుపాయం
- మచ్చలు, మొటిమలు, పుట్టుమచ్చలు, కణితులు మొదలగు వాటికి ప్లాస్టిక్ సర్జరీ ద్వారా చికిత్స
- వక్షోజాలు చిన్నవిగా ఉంటే పెద్దగా, మరీ పెద్దవిగా ఉంటే సరిపోయే విధంగా చేయుట
- కాలిన గాయాలకు మరియు కాలి ముడతలు పడిన అవయవాలను సరిచేయుట (Burns Ward)
- శరీరంలో అసహజంగా పెరిగిన కొవ్వును తగ్గించుట, వదులుగా వున్న పొట్టను Abdominoplasty ద్వారా సరిచేయుట
- నరాలు మరియు శరీర అవయవాలు తెగినచో మైక్రోన్యూరల్ /మైక్రోవ్యాస్కులార్ చికిత్స
- భోదకాలు మోయలేని భారంగా మారితే ప్లాస్టిక్ సర్జరీ ద్వారా తగ్గించడం
- కుటుంబ నియంత్రణ ఆపరేషన్ తర్వాత మళ్ళీ సంతానం కావాలనుకునే వారికి ఆపరేషన్ ద్వారా పిల్లలను కలిగించుట
- ముఖమునకు తగిన విధంగా ముక్కును సరిదిద్దుట, ముఖంలో వచ్చే ముడతలను తొలగించుట
- ఇన్సిషనల్ హెర్నియా బాగుచేయుట

Consulting Hours : 12 noon to 2 pm & 6 pm to 8 pm 24 Hours Emergency : Phone: 23759999

CGHS & ESI Recognised

IMAGE HOSPITALS
SUPER-SPECIALITY CENTRE
Ameerpet, Hyderabad-500073, A.P., India.
Ph: 23750000/55519999 Fax: 040-23746616.
www.imagehospitals.com e-mail: imagehospitals@rediffmail.com

IMAGE HOSPITALS


ISO 9001-2000 Certified Hospital

Image Communications

## పోషకాలున్న పిస్తా పప్పులు

*భోజనం చేసినా మధ్య మధ్య ఏదో తినాలనిపిస్తుండటం సహజం. శరీరానికి అపకారం చేయనివే తీసుకోవాలి. పీచు, విటమినులు, ఖనిజలవణాలు, ప్రోటీన్లు వున్న పిస్తాపప్పులు తీసుకోవచ్చు. తక్షణపౌష్టికాలను అందజేసేవి ఇట్లాంటి ధాన్యాలు. భోజనసమయం కానప్పుడు, ఆకలేస్తే బాదాములు, పిస్తాలు, జీడిపప్పు, వేరుసెనగలను తినటం తక్కువ కాలరీలు శరీరానికి అందించాలనే. వీటి వల్ల మధుమేహం వచ్చే అవకాశాలు తగ్గుతాయి. కొలెస్టరాల్, కొవ్వు తక్కువగా వుండే పిస్తాలను తాత్కాలికాహారంగా తీసుకోవచ్చు.*

ఎన్.



తొడిమలతో తెల్లని పువ్వుల మొక్కల్లా వున్న పిల్లలున్న ఆ క్లాసు అంతా, గ్రుడ్డెద్దు చేలో పడి క్రుమ్మినట్లు అయిపోయింది. హాహాకారాలెత్తి పోయారు పిల్లలు.

"స్పేర్ ది రాడ్ అండ్ స్పాయిల్ ది ఛైల్డ్" అని గోడల మీద రాయించాను. చూడలేదా? అంటూ శర్వాణిని కొర కొరా చూస్తూ వెళ్ళిపోయాడు. హెచ్. ఎమ్.

ఆ మరుసటిరోజు శర్వాణి పెరుమాళ్ చెట్టియార్ అండ్ సిక్స్‌టీన్ దోసేస్" అన్న ఇంగ్లీషు పాఠం చెబుతోంది. పాఠంలో పెరుమాళ్ చెట్టి స్నేహితులతో పందెంకాసి, పదహారు దోసెలు ఏకబిగిన తినేస్తాడు.

ఈ పాఠం విని గిరీష్ అన్న కుర్రవాడు లేచి "ఐ వాంట్ ఫోర్ దోసెస్ మిస్"... అన్నాడు.

ఈ మాటలు అట్నుంచి వెళ్తూన్న హెచ్.ఎమ్. ఇటు వచ్చి విన్నాడు. అగ్గి రుద్రుడైపోయాడు!

క్లాసులోకి వచ్చి "ఏంట్రా నీకు ఫోర్ దోసెలు కావాలా? ఇదేం పుల్లట్ల పాక అనుకున్నావారా రాస్కెల్ ... డజన్ ఇడ్లీ తెప్పిస్తా, తింటావురా? అంటూ గద్దించాడు.

వాడు ఉత్సాహంగా తింటాను సార్! బెట్!" అన్నాడు. హెచ్.ఎమ్‌కి వెర్రెత్తింది. ఆయాని పిలిచి "ఇడ్లీలో పదితేవే, సూరమ్మా!" అన్నాడు. "తినరా! తినకపోతే చంపుతానన్నాడు."

గిరీష్‌కి నాలుగు ఇడ్లీలు తినేసరికి స్పీడు తగ్గింది. వెక్కిళ్లు మొదలైనాయి. శర్వాణి మంచి నీళ్లు ఇవ్వబోయింది. స్టాపిట్! పది ఇడ్లీ తింటేనే వీడివాళ ఇంటికి పోతాడు. పదీ తినిపిస్తేనే, నువ్వు రేపు స్కూలుకి వస్తావు" అన్నాడు. "టేక్కేర్" అంటూ వెళ్లిపోయాడు. కాస్సేపటికి మళ్లీ వచ్చి గిరీష్ చేత ఇడ్లీ నోట క్రుక్కి మరీ తినిపించమని శర్వాణి మీద వత్తిడి తెచ్చాడు. చీటికీ మాటికీ పిల్లల్ని కొట్టే శర్వాణి క్కూడా క నీ ళ్ల ం పర్యంతం అయింది.

ఆ పిల్లవాడు కొంతసేపటికి సొమ్మసిల్లి పడిపోయాడు. "వీణ్ని రిక్షాలో వేసి, వాళ్లింటి దగ్గర వదిలెయ్యమన్నాడు హెచ్.ఎమ్. "తింటాడంట! పదిహేను ఇడ్డెనలు! ఏమనుకుంటున్నాడో... హుం... నాది అంతా స్ట్రిక్ట్ డిసిప్లిన్" అంటూ వెళ్లిపోయాడు.

గిరీష్ తల్లిదండ్రులు అంత చదువుకున్నవాళ్లు కారు. ఇంటికి దగ్గరలో వుంది కొత్త ఇంగ్లీషు స్కూలు కదాని పిల్లవాణ్ని అందులో వేశారు. అలాగే ఆ చుట్టుపట్ల వాళ్లంతా స్కూలు నింపేశారు... అసలా హెచ్.ఎమ్. ఎటువంటివాడో వాళ్లకి తెలియదు.

గిరీష్‌ని తల్లిదండ్రులు ప్రక్కనే వున్న డాక్టర్ దగ్గరికి తీసుకుపోయారు!

"ఫుడ్ పాయిజనింగ్" అయిందని చెప్పాడు, డాక్టర్. గిరీష్ ఫ్రెండ్స్ వచ్చి ఆవేశంగా స్కూల్లో టీచర్ ఇడ్లీలు కుక్కి కుక్కి తినిపించిందని చెప్పేరు. ఇరుగూ పొరుగూ వున్న కార్మికులు కష్టజీవులు అంతా, కలిసి ఆవేశంగా హెచ్.ఎమ్. ఇంటి మీదకి దాడిగా పోయివడ్డారు.

పరిస్థితి చెయ్యిదాటిందని గ్రహించిన హెడ్ మాస్టారు ఫణీందర్ రావు "సారీ... సారీ బ్రదర్స్! అదుగో, ఆ టీచరమ్మాయే వుత్త సాడిస్టు రోజూ ఏదో విధంగా ఇట్లా పిల్లల్ని కాల్చుకు తింటోంది. ఆమెదే యీ నిర్వాకం, నేను తక్షణం ఆ టీచర్‌ని తీసేస్తాలేండి... ఇదుగో, యీ వందరూపాయలు తీసుకుపోయి గిరీష్ బాబుకి ట్రీట్‌మెంట్ ఇప్పించండి.. అసలేవాడు బక్కపీచు" అంటూ వాళ్లని శాంతబరిచి, మెత్తబరిచి పంపేశాడు. తాను తప్పించుకున్నాడు.

మర్నాడు ఉదయం శర్వాణి స్కూలుకు బయలుదేరుతూ వుండగా, ఆయా ఇంటికే వచ్చింది, "సారుగారు మిమ్మల్ని స్కూలుకి రావద్దన్నారు. రావాల్సిన జీతం డబ్బులు నెలాఖరున కనబడి పట్టుకు పొమ్మన్నారు. మీరొస్తే జనాలు చంపేస్తారంట" అని చెప్పి వెళ్లిపోయింది.

శర్వాణి గుండె గాయమయింది. 'ఛీ' అనుకుంది.

అక్కణ్నుంచి వచ్చేసిన కొన్నాళ్లకి యీ స్కూలులో చేరితే- 'శాడిస్టు' అన్నాడే స్కూలు యజమాని! బెత్తంతో కొడితే 'గాయం' అవుతుందని చేత్తో కొడుతుందీ మధ్య- అదీ విషమించింది. ఆమెకి ఏమీ తోచలేదు. విసుగు, విరక్తీ పెనవేశాయ్.

ఆ సాయంకాలం నవనీతం అన్న పాప వాళ్ల ఇంటికి ధైర్యం చేసి వెళ్లింది. "సారీ" చెప్పింది.

ఆ పిల్ల శర్వాణిని చూస్తూనే, "మిస్ వచ్చారూ, మిస్ వచ్చారూ..." అంటూ దెబ్బలు మరిచిపోయి వెన్నెలలా నిర్మలంగా నవ్వేసింది.

ఆ పిల్ల పేరెంట్స్ అన్నారు- "గుండె మరీ అంత పుండు చేసుకోబాకమ్మా. పిల్లల్ని ఒక్కసారి ఆవేశంలో మేం కూడా ఓ దెబ్బ వేస్తాం. ఇదీ అట్లాంటిదే", నంటూ "చిన్న గాయమైనా మానిపోతుందిలే" అంటూ కాఫీ ఇచ్చి త్రాగమని బలవంతం చేశారు.

శర్వాణి గుండె గాయానికి ఉపశమనం కలిగింది. అటు తర్వాత రోజూ స్కూల్లో గాజులు తీసి, బ్యాగులో వేసుకోడం అలవాటు చేసుకుంది, శర్వాణి, పిల్లల్ని కొట్టకుండా పాఠాలు చెప్పాలని శక్తివంచన లేకుండా ప్రయత్నం చేస్తోంది... అది సాధ్యమా?... ■

## హెచ్ఆర్‌టీతో ప్రమాదం

*హెచ్ఆర్‌టీ అంటే హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ. మెనోపాజ్ వస్తున్న మహిళలకు ఈ థెరపీ చేస్తారు. శరీరంలో ఉత్పత్తి అయ్యే హార్మోనుల స్థాయి తగ్గినప్పుడు ఈ చికిత్స చేయించుకోవటం వల్ల వేరే జబ్బులు రాకుండా వుంటాయి. కానీ ఈ థెరపీ వల్లే హార్ట్ ఎటాక్ వచ్చే అవకాశం 42 శాతమూ, వక్షోజాల కాన్సర్ వచ్చే అవకాశం 28 శాతమూ పెరుగుతాయని పరిశోధనలు తేల్చాయట. కనుక హెచ్ఆర్‌టీ చేయించుకునే ముందు మరోసారి డాక్టర్ల సలహాలు తీసుకోవాలి.*

ఎన్.